క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

బేస్తవారిపేట: మండలంలోని పాపాయిపల్లెలో నల్లబోతుల మహాలక్ష్మమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆదేశాల మేరకు రూ.50 వేల చెక్కును పంపిణీ చేశారు. ఎంపీటీసీ దగ్గుబాటి బాల రంగయ్య, సచివాలయ కన్వీనర్ దయ్యాల నరసయ్య, నాయకులు సాల్వ చంద్రశేఖర్, పిక్కిలి సుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు అంకిత భావంతో విద్యనభ్యసించాలి



ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: విద్యార్థులు అంకిత భావంతో విద్యనభ్యసించాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. పట్టణంలోని అరుణోదయ స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా వితానుబ్బరత్నం కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మరో ముఖ్య అతిథి ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్యే అన్నాను, ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డిని ఘనంగా సన్మానించింది. ఎంఈఓ నరసింహారావు, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు పి.స్వరూపారెడ్డి, అరుణోదయ స్కూల్ కరస్పాండెంట్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ గురుప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువ, ఇళ్లపై సమీక్ష



నాగమణికి నగదు అందజేస్తున్న డీపీఓ

దొనకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న పాలవెల్లువ, ఇళ్లపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జీవీ నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 1038 జగనన్న ఇళ్లు మంజూరయ్యావని, నేటి వరకు 755 మందికి బ్యాంకు రుణాలు రూ.35 వేలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మండలంలో 27 జగనన్న పాల వెల్లువ సెంటర్లు మంజూరయ్యాయవని, అందులో మొదటి విడతగా 6 సెంటర్లు ప్రారంభమై పాలు సేకరిస్తున్నారన్నారు. డ్వాక్రా గ్రూపు మహిళలకు గేదెలు కొనుగోలు చేసేందుకు రుణాలు ఇప్పించాలని అధికారులకు సూచించారు. దొనకొండ గ్రామ సంఘంలోని ప్రగతి గ్రూపులోని సభ్యురాలు నాగమణికి జగనన్న ఇల్లు నిర్మించేందుకు లక్ష రూపాయలు రుణం ఇప్పించి నగదు అందజేశారు. ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఏపీఎం జి.వెంకటేశ్వర్లు, సీసీలు, వీఓలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కార్మికులకు చీరల పంపిణీ

పొదిలి: లాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక చిన్న బస్టాండ్ సెంటర్‌లో పేదలకు నిత్య అన్నదానం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రంజాన్ సందర్భంగా పేదలు, నగర పంచాయతీ మహిళా కార్మికులు వంద మందికి శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, ముల్లా జిలానీ బాషా, షేక్ షర్మిల, మస్తాన్‌వలి, ఫౌండేషన్ చైర్మన్ ఆకిబ్ అహ్మద్ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కొమరోలు: రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు తెలిపారు. కొమరోలు–2 సచివాలయం పరిధిలోని వీధుల్లో 96వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. తొలుత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే రాంబాబును భారీ గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ఆయా వీధుల్లోని ప్రతి గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. మూడేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పుస్తకాలను జగనన్నే మా నమ్మకం కరపత్రాలు దించారు. అనంతరం ఆయా వీధుల్లో స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాంబాబు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా జగనన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన అనేక రకాల సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికి వైఎస్సార్ సీపీ పాలనలో ఆర్థిక భరోసా కల్పించినట్లు పేర్కొన్నారు. నవరత్నాలు పథకాలతో ప్రతి గడపలో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. అబద్ధపు హామీలు ఇస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రజలు నమ్మవద్దని కోరారు. వైఎస్సార్ సీపీ హయాంలో సీఎం జగన్ పాలనలో ప్రతి ఒక్క పేదవాడికి ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలంటూ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ప్రజలను కోరారు. జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు, వైస్ ఎంపీపీ షేక్ మౌలాలీ, ఎంపీటీసీ షేక్ సుభానీ, తిరుమలరాజు, సర్పంచ్‌లు దండు శశికళ, ప్రదీప్, హటీల్ పీరా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు బోయిళ్ల జనార్దన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సారె జనార్దన్‌నాయుడు, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, వెంగయ్యచౌదరి పాల్గొన్నారు.

చేసిన మేలు చెప్పేందుకు గర్వపడుతున్నా



కొమ్మెళ్లపల్లి ఎస్సీ కాలనీలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

కొనకనమిట్ల: జగనన్న పాలనలో చేసిన మేలు మరిచిపోలేమని మీరంటుంటే గర్వంగా ఉందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని కాట్రగుంట పంచాయతీ కొమ్మెళ్లపల్లి, నర్సాయపల్లి, వెంగళపల్లి, పేరారెడ్డిపల్లి, బీసీ, ఎస్సీ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ గొంగటి జెనీఫాతో కలిసి నిర్వహించారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. అన్నీ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు జగనన్న కృషి చేస్తున్నారన్నారు. మంచినీటి సమస్య, రహదారుల అభివృద్ధి గురించి గ్రామస్తుల విజ్ఞప్తిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. తొలుత స్థానిక పార్టీ నాయకులు సానికొమ్ము రవి, వై.సుబ్బారెడ్డి, గురవారెడ్డి, కేసరి కాశిరెడ్డి, చిన్నారెడ్డి, రావు, చల్లా మల్లికార్జునచౌదరి, గోనుగుంట్ల బ్రహ్మయ్యచౌదరి, రాజాల వెంకటేశ్వరరెడ్డి, మేకల వెంకటేశ్వరుయాదవ్, గంగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కందెర పెద్దన్న యాదవ్, గొంగటి కరుణయ్య తదితరులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ ఉడుముల రామానారాయణరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులు, సూరవరపు పెద్దవెకంటరెడ్డి, కంది బాలవెంకటరెడ్డి, చిరుగూరి కోటేశ్వరరావు, కల్లం దిబ్బారెడ్డి, ప్రకాష్, సీసీకెఆర్ శ్రీను, ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, ఏపీఎం గోపాలకృష్ణారెడ్డి, ఎస్సై దీపిక, సచివాలయ ఉద్యోగులు, స్థానిక పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పది కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల

కొనకనమిట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. కాట్రగుంట మాజీ సర్పంచ్ జి.బ్రహ్మయ్య, నాయకులు రాజాల వెంకటేశ్వరరెడ్డి, గంగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఓబులరెడ్డిపల్లికి చెందిన పట్నం బాలసుబ్బయ్య, 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. ఎమ్మెల్యే కేపీ, మాజీ ఎమ్మెల్యే ఉడుముల, ఎంపీపీ మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ ఏడుకొండలు, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగనన్న ప్రమాణస్వీకారం చేస్తారని కార్యకర్తల హర్షధ్వానాల మధ్య ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మంచినీటి చలివేంద్రాలు ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్, డీపీఓ



చలివేంద్రం పారంభిస్తున్న కమిషనర్

దర్శి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, సివిల్ సర్వీస్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాలర్పించారు. ఎంపీడీఓ కుసుమకుమారి మాట్లాడుతూ దేశానికి పటేల్ చేసిన సేవలు కొనియాడారు. అనంతరం లంకోజనపల్లి పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి గ్రామంలో తాగునీరు, ఇతర సమస్యలపై చర్చించారు.

చలివేంద్రం ప్రారంభం

మండలంలోని రాజంపల్లిలో సర్పంచ్ వనం అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా తాగునీటి చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల సచివాలయాల కన్వీనర్ బత్తినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని సామాన్యుల దాహార్తి తీర్చేందుకు సచివాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పొదిలి: స్థానిక చిన్న బస్టాండ్ సెంటర్‌లోని పాత పంచాయతీ కార్యాలయం వద్ద నగర పంచాయతీ ఆధ్వర్యంలో మంచినీటి చలివేంద్రాన్ని శుక్రవారం కమిషనర్ జోసెఫ్ డానియేల్ ప్రారంభించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి చిన్న బస్టాండ్ సెంటర్‌కు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: మండలంలోని బెల్లంకొండవారిపాలెం పంచాయతీ పరిధిలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. రామాలయం వద్ద సర్పంచి పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ జీఎస్ ప్రభాకర్‌రెడ్డిలు చలివేంద్రాన్ని ప్రారంభించారు. మజ్జిగ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. గ్రామ కార్యదర్శి శ్రీవల్లి పాల్గొన్నారు.

దొనకొండ: వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు చాలా మంచివని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జీవీ నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిత్యం ప్రజలు వెళ్లే రహదారిలో సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి పి.క్రిష్ణమూర్తి చలివేంద్రం ఏర్పాటు చేశారు. డీపీఓ నారాయణరెడ్డి చేతుల మీద చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఈఓఆర్డీ ఎస్.డేవిడ్ పాల్గొన్నారు.

ముండ్లమూరు: వేసవిలో ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓఆర్డీ ఓబులేసు తెలిపారు. మండలంలోని పెద ఉల్లగల్లు, బసవాపురం గ్రామాల్లో శుక్రవారం చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో పెద ఉల్లగల్లు సర్పంచ్ జనమాల నాగేంద్రం, కెల్లంపల్లి సర్పంచ్ జమ్ముల గురవయ్య, కార్యదర్శి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు జనమాల పిచ్చయ్య పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ బస్టాప్ ఆవరణలో నగర పంచాయతీ కమిషనర్ వై.రామకృష్ణ శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం పాదాచారుల దాహార్తి తీర్చేందుకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఫ్రిజ్‌తో కూడిన మినరల్ వాటర్ చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమన్నారు. సత్యసాయి సేవా సమితి మండల కన్వీనర్ అనంతరామయ్య, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ కాశీవిశ్వనాథ్, నిర్వాహులు, పాల్గొన్నారు.

కిశోర్‌బాబు సేవలు మరువలేనివి



మేనేజర్‌ను సన్మానిస్తున్న ఖాతాదారులు

దొనకొండ: స్థానిక ఏపీజీబీ మేనేజర్ కిశోర్‌బాబు సేవలు మరువలేనివని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి కొనియాడారు. గురువారం మేనేజర్ కిశోర్‌బాబు కర్నూల్ జిల్లా బంగ్లా మండలం ఏపీజీబీ గ్రామీణ బ్యాంక్‌కు ప్రమోషన్‌పై వెళ్లారు. ఖాతాదారులకు సేవలు అందించడంలో మంచి పేరు పొందారని పలువురు పేర్కొన్నారు. ఆయన్ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. బ్యాంక్ సిబ్బంది, ఖతాదారులు పాల్గొన్నారు.

ముస్లింలకు నాయకుల రంజాన్ శుభాకాంక్షలు

మార్కాపురం టౌన్: దానధర్మాలకు ప్రతీక అయిన రంజాన్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే అన్నా..



ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నియోజకవర్గంలోని ముస్లింలకు స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు శుక్రవారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అత్యంత పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలకిఉ కఠోర ఉపవాస దీక్షలు కలిగి భగవంతుడిని ఆరాధిస్తుంటారు. అలాంటి ముస్లింలు కుటుంబ సభ్యులతో కలిసి మెలసి సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే మద్దిశెట్టి..



ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి

తాళ్లూరు: రంజాన్ క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక అని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మత సామరస్యానికి, పరస్పర సదావగాహనకు ప్రతీకగా రంజాన్ నిలుస్తోందన్నారు. నెల రోజుల కఠోర వ్రతం పాటించిన వారి శ్రమకు పరిపూర్ణ ప్రతిఫలం లభిచే రోజు రంజాన్ అన్నారు.

నాటా మహాసభలకు నాగార్జునరెడ్డికి ఆహ్వానం



నాగార్జునరెడ్డి

మార్కాపురం: ఉత్తర అమెరికా తెలుగు సమితి (నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్–నాటా) మహసభల్లో పాల్గొనేందుకు త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన బద్దిగం నాగార్జునరెడ్డికి ఆహ్వానం అందింది. ఈ మహాసభలు ఈ ఏడాది జూన్ 30 నుంచి జూలై 2వ తేదీ వరకు డల్లాస్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరగనున్నాయి. నాటా అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీధర్‌రెడ్డి ఈ మేరకు ఆయనకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. వైఎస్సార్ సీపీలో నాగార్జునరెడ్డి క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. నాటా కన్వెన్షన్ కమిటీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భూముల రీసర్వే పరిశీలన

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని కొండాయపాలెం, ఓబులక్కపల్లి గ్రామాల్లో జగనన్న శాశ్వత భూహక్కు, భూ రీసర్వే పనులను శుక్రవారం తహసీల్దారు డి.భాగ్యలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది సమన్వయంతో భూ రీసర్వేను పక్కాగా చేయాలన్నారు. ఎక్కడా విమర్శలకు తావు లేకుండా రైతుల అభిప్రాయాలను పరిగణంలోకి తీసుకోవాలని చెప్పారు. సర్వే సమయంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం రికార్డులు అందుబాటులో ఉండాలన్నారు. సర్వే వేగవంతం చేయాలని సూచించారు. ఆమె వెంట ఇన్‌చార్జి ఆర్ఐ కిలారి సుబ్బారావు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

గిద్దలూరు సీడీపీఓగా సుబ్బలక్ష్మి

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీఓగా సుబ్బలక్ష్మిని నియమించారు. గిద్దలూరులో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న సుబ్బలక్ష్మికి సీడీపీఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు.

'బార్'అధ్యక్షుడిగా యాసిన్‌బాషా

గిద్దలూరు రూరల్: గిద్దలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ యాసిన్‌బాషా శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన ఎన్నికల్లో యాసిన్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కటారు పోలయ్యను ఎన్నుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

త్రిపురాంతకం: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల(ఏపీఆర్ఎస్)ల్లో 2023–2024 విద్యా సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గణపవరం ఏపీఆర్ఎస్‌తో పాటు మిగిలిన ఏపీఆర్ఎస్‌లో 5,6,7,8, పాటు ఇంటర్, డిగ్రీలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశ పరీక్ష జిల్లా కేంద్రంలో మే 20వ తేదీ ఉదయం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేయాల్సిందిగా మోహన్‌రెడ్డి కోరారు.

100 మందికి రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందిస్తున్న సిరాజ్

మార్కాపురం టౌన్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పేద ముస్లిం మహిళలు పారిశుధ్య కార్మికులు 100 మందికి నిత్యావసరాల కిట్లు, దుస్తులు అందించారు. ప్రతి ఒక్కరు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే లక్ష్యంతో గత పదేళ్ళ నుంచి ప్రతి ఏటా రంజాన్ తోఫా అందిస్తునట్లు సిరాజ్ తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

తాళ్లూరు: జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ నిరీక్షణరావు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం గృహ నిర్మాణాలపై ఎంపీడీఓ వజ్జా శ్రీనివాసరావు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ దశల్లో ఉన్న గృహాల నిర్మాణాన్ని వేగవంతం చెయ్యాలని కోరారు. హౌసింగ్ ఏఈ మనోహార్, ఇన్‌చార్జి ఏఈ కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్



గృహానికి స్టిక్కర్ అంటిస్తున్న నాయకులు



మూగచింతలలో కూలీలకు బుక్‌లెట్ పంపిణీ చేస్తున్న నేతలు

పొదిలి రూరల్: మండలంలోని బట్టువారిపల్లెలో రామాంజనేయరెడ్డి, ప్రభుదాసు, కంబాలపాడులో తల్లపు వెంకట నారాయణరెడ్డి, జగన్ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ ఫలాలను వివరించి, ఇంటికి స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్లు, పార్టీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు సేకరించారు. లబ్ధిదారుల అనుమతితో వారి గృహాలకు స్టిక్కర్లు అంటించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి, పట్టణ కన్వీనర్ కొండా రఘునాథరెడ్డి, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

రెండు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి

- ఇద్దరికి గాయాలు

ముండ్లమూరు: మండలంలోని పులిపాడు రైల్వే బ్రిడ్జి వద్ద శుక్రవారం రాత్రి వేర్వేరు సమయాల్లో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. పులిపాడుకు చెందిన గోపి ద్విచక్ర వాహనంపై దర్శి వెళ్తుండగా దర్శి–అద్దంకి ప్రధాన రహదారిలో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఆగి ఉన్న వరి గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. అదే సమయంలో బ్రిడ్జి వద్ద ఆగి ఉన్న యాదాల కాశీరాజును ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వారిని ఓ ప్రైవేట్ వాహనంలో దర్శి తరలించారు. కొద్దిసేపటికే మరో ప్రమాదం జరిగింది. పులిపాడుకు చెందిన చల్లా గోవిందరాజు (34) మరో ద్విచక్ర వాహనంపై కనిగిరి నుండి పులిపాడుకు వస్తూ బ్రిడ్జి వద్ద ఆగి ఉన్న వరి గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొనడంతో బైకు అదుపుతప్పింది. గాయపడిన గోవిందరాజును వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడు కనిగిరి మండలంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఎస్ఐ సంపత్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

హిందీ ప్రచారసభ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

త్రిపురాంతకం: దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో జరిగిన హిందీ పరీక్షల్లో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 43 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాజశేఖరరెడ్డి తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించే అన్ని హిందీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, ఆగస్టులో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఈ ఏడాది 43 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అంతా ఉత్తీర్ణులవడంతో విద్యార్థులకు హిందీ ప్రచారసభ నుంచి అందిన సర్టిఫికెట్స్ అందజేసినట్లు వివరించారు.